రకు ఆయిదారు కోసుల దూరములో నున్నది.) ఇంతేగాక వారు స్వయముగా రెండుమూడు పర్యాయములు వంధ్యాస్త్రీలకిచ్చి గుణము ఫలవంతముగా అనుభవమున చూచినామని చెప్పినారు. దీనినివారు వాడినవిధానమును తెలియచేసినారు. దానినికూడా వ్రాయుచున్నాను.

### వాడు విధానము

ఋతుస్నాతయగు స్త్రీకి స్నానానంతరము వెంటనే- గడినుండి యివతలికి రాకుండా (అనగా గడపదాటకూడదు) యీలతయొక్క వేరును సుమారు ఒక తులమెత్తు పదితులాల ఆవుపాలతో నూరి కల్కముచేసి తాగించవలయును. ఒక పర్యాయము తాగించిన చాలును. ఎవరికి కూడా రెండుపర్యాయములు తాగించలేదని శ్రీశేషాచార్యులవారు చెప్పినారు. ఇట్లు తాగించిన రోజున ఆవుపాలు అన్నముమాత్రమే పథ్యముగా వుండాలి. అదే నెలయందు గర్భమునిలుచును. లేదేని రెండవమాసమున తప్పదు. మొత్తము మీద మూడుమాసముల లోపుగా గర్భధారణ కలుగుతుంది.

### పరిశోధన

ఈయోషధి వర్షాకాల ప్రారంభము నుండి చలికాలము అంతమువరకు మాత్రమే దొరుకుతుంది. యీరోజులలోనె దీనిని వుపయోగించాలి. 'శరద్యఖిలకార్యార్థం' అన్నట్లు శరద్హేమంతములలో వే దీనిని వాడుట చాలామంచిది చికిత్సకులు వాడిచూచి తమ అనుభవమును ఈ పత్రికాముఖమున వెల్లడింపవలయును. దీనినిగురించిన విశేషము లేమైన నున్న యెడల తెలియచేయవలయును.

—(ఆయుర్వేదకళ.)

# ఆ పిల్లడు ఎవరూ ?

మధురానికి 'మళ్ళీపెళ్ళి' ఆనందంతో!
కొడుకుసంగతి కానకపోయాడు—
రంకుతనమని అపోహ పడ్డాడు.
ఆఖరికి యింటికొంచి పొమ్మన్నాడు—

కథకుడు :

## బందుచోడే లక్ష్మణరావు

'—మధురం! మీయింటికి వెళ్లు, మీ ఆనందం వచ్చేవేళ అయింది.'

.. ........

*          *          *

'మధూ! అపిల్లడు ఎవరూ?' - అంటూ లోపలికివచ్చాడు- ఆనందం.

'అబ్బె-వాళ్ళబ్బాయి లెండి' అంది మధు, సంతోషంగా చూస్తూ!

'నీకూ్కడా, .....'

'నా ఖర్మం'

'ఎలా, ఏడుస్తున్నాడో ? పాపం !' అని కుర్చీలో కూర్చున్నాడు ఆనందం.

'అమ్మకోసం...'

'యిచ్చిరా, వెళ్లు'

*          *          *

'గంటసేపయిందే ? - ఏంచేస్తుంది. యింకా అక్కడ ?—' అనుకున్నాడు ఆనందం.

*          *          *

'మధురం! అర్ధరాత్రివేళ తీసుకొని వచ్చావేం?'

గడియారం ఎనిమిది కొట్టింది, టైం ఎక్కువ కానట్టు.

'వాడితల్లి గుళ్ళోకెళ్ళింది'

'అంతా యేమయ్యారు?'

'పుత్తరతీర్థాని కెళ్ళారు'

'ఎప్పటి కొస్తారో?'

'దీపాలు ఆరేవేళకి'

'సరే, వచ్చిందేమో యిచ్చిరా'

ఆమె తిరిగి వెళుతుంది.

*          *          *

'ఇంతసేపు ఏమిచేస్తుందో?' అనుకుంటూ ఆటూ యిటూ తిరిగాడు-ఆనందం.

తొమ్మిదికొట్టింది- గడియారం

*          *          *

ప్రొద్దెక్కినా లేవకపోతే,—

తట్టుతూ, లేపింది మధురం- ఆనందాన్ని !—

ఎఱుపెక్కిన కళ్ళతో,-

బరువెక్కిన హృదయంతో...

విసుక్కుంటూ లేచాడు- ఆనందం.

'ఇంత ఆలస్యంగా లేచారు ఈ వేళ ఆఫీసులో సెలవు పెట్టారేం?'

'హృదయంలో, పూరితిత్తులు బరువెక్కినై'

'కమలాకరాన్ని కబురుచేస్తే?—'

'కోమలహృదయం కందుతుందేమో?'

'మీయిష్టం...'

... ... ...

'వాళ్ళబ్బాయీ,...'

'తీసుకురా,—పాపం'

.........

*       *       *

'మధురం! మనకు సంతులేదుకదా?' అని అనుమానంగా ప్రశ్నించాడు—సాసర్లో 'ఓవల్టీన్' పోసుకుంటూ!

'కళ్ళనీళ్లు తుడిచేందుకు..'

'అబ్బాయిని యిచ్చి...'

'వెళ్ళిరా పాపం'

*       *       *

'వెళ్ళి గంట అయిందే? యింతవరకూ ఏంచేస్తుందో?—ఓహో!...'

*       *       *

మందహాసంతో మధురం వచ్చింది-

'నన్ను మరపించేవాళ్ళెవరూ?'అన్నాడు ఆనందం.

'అబ్బాయే' అని ముద్దులాడింది.

'ఎవరబ్బాయి?' ఓవిధమైన ప్రశ్న-

ఆమె లేతగుండె కరడుకట్టింది. లేని సంతాపం లేచివచ్చింది. అసలు విషయం అనబోయింది. కంఠంలో కఫం అడ్డుపడి చంకలోని చంటివాడు చతికిలపడ్డాడు.

*       *       *

'ఏం? మాట్లాడవేం? ఏరంకుమొ...'

'లేను అపోహపడకండి'

'నాయింటిలోంచి వెళ్ళిపో, —లంజా?—'

'నన్ను అలా అనకండి. నా అనే వాళ్లులేరు.'

'ఏమీలేని యిస్తరి ఎగిరిపడ్డం ఎందుకు?'

'నోరులేని పిల్లాడిని...'

'వీణ్లేదు లేచి వెళ్ళిపో, చండివాడితో,'

*       *       *

ఆమె అసలుభర్త త్రాగుబోతు. కళ్లుతెలియక ఒళ్లుచితుక కొట్టేవాడు.

*       *       *

కూటికి లేక కూలికి వెళ్ళేది

*       *       *

నిండుగర్భిణితో వుంటే, వెల్లగొట్టాడు—పాపం!

*       *       *

పదిరోజులు పస్తుండి ప్రసవించింది

*       *       *

ఆరోనెలలో ఆనందం చేరదీశాడు.

కొడుకుసంగతి కప్పిపుచ్చింది—

అవు ననుకొని ఆదరించాడు-ఆనందం.

పొరుగింటిలోవుంచి పాపని పొట్ట నింపుతూంది!—

పరమరహస్యంగా పసివాన్ని—

మాతృ ప్రేమ!

*       *       *

మధురానికి 'మళ్ళీపెళ్ళి' ఆనందంతో!

కొడుకుసంగతి కొనకపోయాడు—

రంకుతనమని అపోహపడ్డాడు.

ఆఖరుకి యింటిలోంచి పొమ్మన్నాడు—పాపం!

సమాధాన మేమీ చెప్పలేక పోయింది- ఆమె

కండ్లెర్రజేసి గర్జించాడు- అతను.

ఆమె పిల్లాడిని ఎత్తుకుంది.

*       *       *

మెడపట్టి బైటికి గెంటాడు.

*       *       *

హోరున వీస్తూంది-గాలి.

భోరున కురుస్తూంది-వాన.

ఫడ ఫడ పడ్ పడ్ మని - పడింది పిడుగు.

కన్ను పొడుచుకున్నా—కనుపించని కటికి చీకటి!

నల్లనికురులు మెల్లగవీడి—

ముఖంనిండా క్రమ్మయి!

హడలిపోతున్న హృదయంతో—

తడబడుతున్న కాళ్ళతో!

వణకిపోతున్న కంఠంతో!—

అంధకారబంధురమైన ప్రకృతిలో

ఐక్యమయింది - మధురం.

# నాల్గశ్రుబిందువులు

[పాయమందని పసికన్నె. అభము శుభమెఱుగని వయసునందే పసుపు కుంకుమ మాసినది. జీవిత మొక మెఱుపు వంటిది. క్షణికము. ఉన్న రెండు క్షణములలో కళ్ళను మిఱుమిట్లు గొల్పుతుంది. మరుక్షణం అంధకారంలో అణగిపోయి నిరాశ కల్పిస్తుంది. చిన్ని నాథుని, విధినోటబెట్టుకొన్న దెఱుగని కన్నె సోయగముపైనా, అమాయకతపైనా జాలికల్గి రాలిన బిందువు లివి!]

ప్రొద్దుప్రొద్దునె
పొన్నపూలను
అద్దమందున
దిద్దుకొందువు!

ఎవరికోసర మింత ?
ఎందుకోసర మింక ?

చిన్నినాథుని
చిత్రపటమును
పొన్నపూలతొ
పూజసేతువు! ఎవరి॥

చెలులగూడుక
చెలువుమీఱగ
చిట్టిబొట్టును
పట్టుచుందువు ఎవరి॥

ఆటలందున
అలరుబోడులు
నాథునడుగగ
నవ్వుకొందువు ఎవరి॥

—పిల్లలమర్రి వెంకటహనుమంతరావు.